సాక్షి తిరుపతి

సోమవారం । 27 । జనవరి । 2025



విచ్చలవిడిగా 'చుక్క..ముక్క'!

గణతంత్ర దినోత్సవం అయినప్పటికీ ఆదివారం విచ్చలవిడిగా మద్యం, మాంసం విక్రయాలు సాగాయి. - 8లో



అమ్మ మనసు

తిరుపతిలో నిర్వహించిన రిపబ్లిడే వేడుకల్లో వేదికపై జరిగిన అపూరూప దృశ్యం పలువురి దృష్టిని ఆకర్షించింది. - 8లో

ఉత్తమ సేవలకు పురస్కారం



గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు కలెక్టర్ వెంకటేశ్వర్ అవార్డులు ప్రదానం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

అవార్డుల ఎంపికపై అసంతృప్తి

తిరుపతి అర్బన్ : రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లాలోని 93 విభాగాలకు చెందిన 479 మంది ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు ప్రదానం చేశారు. అంటే ఒక్కో విభాగానికి సరాసరిగా 5 పురస్కారాలు అందించాల్సి ఉంది. అయితే కొన్ని విభాగాల్లో ఉద్యోగుల సంఖ్య మేరకు అవార్డుల సంఖ్య ఉంటుందని అందరూ భావించారు. అలా కాకుండా కొన్ని విభాగాల వారినే అత్యధికంగా అవార్డులకు ఎంపిక చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్ సిబ్బందికి 45 అవార్డులు దక్కాయి. పోలీస్ శాఖకు 100, రెవెన్యూ ఉద్యోగులకు 31 పురస్కారాలు అందించారు. ఈ క్రమంలో పేదలకు అహర్నిశలు సేవలందించే వైద్య విభాగానికి 15 అవార్డులు మాత్రమే దక్కాయి. ఆర్టీసీలో 4,600 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, కేవలం నలుగురికే పురస్కారాలు లభించాయి. సచివాలయ ఉద్యోగులు–3 , వాణిజ్య పన్నులశాఖ–2, దేవదాయశాఖ–3, అటవీశాఖలో ఐదుగురికి మాత్రమే పురస్కారాలు రావడంపై సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవార్డుల ఎంపికలో పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని మండి పడుతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగ్రహం



స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తున్న రైతు, ప్రజా సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: కేంద్రంలో ఉన్న మతోన్మాద శక్తుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయని, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న వారి నుంచి దేశాన్ని కాపాడుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రామానాయుడు పిలుపునిచ్చారు. రైతు, కార్మిక సంఘాల దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా ఆదివారం తిరుపతిలో భారీ స్కూటర్ ర్యాలీ చేపట్టారు. బాలాజీ కాలనీ పూలే విగ్రహం నుంచి ఆర్టీసీ బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. రామానాయుడు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతులపై కక్షగట్టి పంటలకు కనీస మద్దతు ధర కూడా ప్రకటించడం లేదన్నారు. రైతు కూలీల సంఘం జిల్లా కార్యదర్శి రామిశెట్టి వెంకయ్య, ఐఎఫ్‌టీయూ నేత వెంకటరత్నం, ఏఐటీయూసీ జిల్లా నేత రాధాకృష్ణ , రైతు సంఘం నేత హేమలత మాట్లాడుతూ దొడ్డి దారిన అన్నదాతలకు ద్రోహం చేసే చట్టాలు తీసుకురావడం దారుణమన్నారు. కార్మిక, కర్షక, కూలీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేతలు మాంగాటి గోపాల్‌రెడ్డి, శివారెడ్డి, చిన్నం పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నేత ప్రభాకర్, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నేతలు పాల్గొన్నారు.



రిపబ్లిక్ డే వేడుకల్లో జాతీయ పతాకం ఆవిష్కరించి వందనం సమర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ శుభం బన్సల్, ఎమ్మెల్యేలు ఆరణి, కోనేటి తదితరులు

పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థినుల కళా ప్రదర్శన

ముువ్వన్నెలు సగర్వంగా రెపరెపలాడాయి.. గణతంత్ర దినోత్సవ విశిష్టతను ఎలుగెత్తి చాటాయి.. భారత సార్వభౌమాధికారానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి.. ప్రతి ఒక్కరిలో దేశభక్తిని ఇనుమడింపజేశాయి.. భావి పౌరుల ఉజ్వల భవితకు బాటలు వేయాలని పాలకులకు దిశా నిర్దేశం చేశాయి. ఈ క్రమంలోనే ఆదివారం తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ చేతుల మీదుగా జాతీయ పతాకం ఆవిష్కరించారు. జిల్లా అభివృద్ధే అజెండాగా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రగతి పురోగతిని వివరిస్తూ శకటాల ప్రదర్శన చేపట్టారు. భరతమాతకు వందనం సమర్పిస్తూ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు పురస్కారాలు ప్రదానం చేశారు.



జెండా వందనం సమర్పిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు తదితరులు

సగర్వం.. త్రివర్ణం

మురిసిన మువ్వన్నెలు

- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- పతాకావిష్కరణ చేసిన కలెక్టర్ వెంకటేశ్వర్
- ప్రగతి పురోగతిని వివరిస్తూ ప్రసంగం
- ఆకట్టుకున్న శకటాలు.. స్టాల్స్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్తమ అవార్డులు అందుకున్న 479 మంది ఉద్యోగులు



చంద్రగిరి : ముస్లిం విద్యార్థినుల సంబరం

తిరుపతి అర్బన్/తిరుపతి క్రైమ్ : జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతి నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 76వ గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, కోనేటి ఆదిమూలం, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్ఓ నరసింహులు పాల్గొన్నారు. ఈ క్రమంలో జాతీయ జెండాను కలెక్టర్ ఎగురవేశారు. గౌరవ వందనం సమర్పించారు. శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పోలీస్ జాగిలాలతో పలు విన్యాసాలు చేయించారు. అనంతరం 479 మంది ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు ప్రదానం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు చేసిన తొలి సంతకం ద్వారా టీచర్ పోస్టులను భర్తీని త్వరలో చేపట్టనున్నట్లు చెప్పారు. వ్యవసాయం, ఉద్యానం, పట్టు, పశుసంవర్ధక, మత్స్యశాఖ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. వైద్య, విద్యాశాఖ ఉన్నతికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డీఆర్‌డీఏ, మెప్మా ద్వారా పొదుపు సంఘాల బలోపేతానికి చేపట్టిన అంశాలను వివరించారు. అలాగే ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో డైరెక్టర్ కేవీ సత్యనారాయణ జాతీయ పతాకం ఆవిష్కరించారు. విద్యార్థులతో కలిసి వందనం సమర్పించారు.



మాట్లాడుతున్న ఎపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

టీటీడీ ఆధ్వర్యంలో..

తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం వద్ద గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. టీటీడీ ఈఓ శ్యామలరావు చేతుల మీదుగా జాతీయ పతాకం ఎగురవేశారు. ఈఓ మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు మరింతగా సేవలందించనున్నట్లు వెల్లడించారు. తిరుమల పవిత్రత పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. అనంతరం టీటీడీ నిఘా, భద్రతాదళాల గౌరవ వందనం స్వీకరించారు.

షార్‌లో..

శ్రీహరికోట షార్ కేంద్రంలోని స్పేస్ సెంట్రల్ స్కూల్ మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పతాకావిష్కణ చేశారు. సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వందనం సమర్పించారు.



ఐఐటీలో జెండా ఆవిష్కరించిన డైరెక్టర్ సత్యనారాయణ



మెప్మా స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



పోలీసు జాగిలం విన్యాసాలు



షార్‌లో సీఐఎస్ఎఫ్ వందన సమర్పణ

నిమ్మ రైతుల ఆర్థికాభివృద్ధికి పెట్లూరులోని పరిశోధన స్థానం విశేషంగా కృషి చేస్తోంది. విశిష్ట రకాలను అన్నదాతలకు పరిచయం చేస్తూ సాగును సంబరంగా మారుస్తోంది. శాస్త్రవేత్తల అవిశ్రాంత కృషితో సుమారు 34 ఏళ్లుగా నిమ్మతోటల అభివృద్ధికి బాటలు వేస్తోంది. ప్రధానంగా పరిశోధకులు వినూత్నంగా సృష్టించిన పులుసు.. బాలాజీ నిమ్మ రకాలతో రైతు అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. మార్కెట్‌లో సైతం వీటికి డిమాండ్ పెరగడంతో ఇతర ప్రాంతాల వారు సైతం ఆసక్తి చూపుతున్నారు.

- 34 ఏళ్లుగా రైతుల సేవలో పెట్లూరు పరిశోధన స్థానం
- లక్షల సంఖ్యలో పులుసు, బాలాజీ నిమ్మ మొక్కల పంపిణీ
- అధిక దిగుబడి సాధించేందుకు సహకరిస్తున్న శాస్త్రవేత్తలు



పెట్లూరులోని పరిశోధన కేంద్రం

అదిరిందమ్మా.. పెట్లూరు నిమ్మ!

సైదాపురం : వెంకటగిరి సమీపంలోని పెట్లూరులో సుమారు 34 ఏళ్ల క్రితం నిమ్మ పరిశోధన స్థానం ఏర్పాటు చేశారు. ఇక్కడి శాస్త్రవేత్తలు రూపొందించిన పులుసు, బాలాజీ నిమ్మ చెట్లు అధిక దిగుబడి ఇస్తున్నాయి. దీంతో రైతులు సైతం వీటి సాగుకే మొగ్గుచూపుతున్నారు. ఈ చెట్లకు తెగుళ్లు సోకకపోవడం, నాణ్యమైన కాయలు వస్తుండడంతో అన్నదాతలు పెద్దసంఖ్యలో సాగు చేపడుతున్నారు. నాట మొక్కల కంటే పెట్లూరు మొలకలు 4 ఏళ్ల నంచి 30 ఏళ్ల వరకు పంట దిగుబడి ఇస్తుండడంతో వీటిపై మక్కువ పెంచుకుంటున్నారు. పరిశోధన స్థానంలో సైతం మేలు రకం మొక్కలను కేవలం రూ.50 చొప్పున విక్రయిస్తుండడంతో రైతులు ఆనందంగా కొనుగోలు చేస్తున్నారు. దీనికితోడు పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నిమ్మ తోట సంరక్షణకు సలహాలు అందిస్తుండడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రైల్వేకోడూరు, ఆరిమోను పాడులో లభించే నిమ్మ మొక్కలను సాగు చేసి నష్టాల బారిన పడినవారు సైతం ఇప్పుడు పెట్లూరు వైపు దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధన స్థానం వారు లక్షల సంఖ్యలో నిమ్మ మొక్కలను అందిస్తుండడం విశేషం.

ఏటా లక్ష మొక్కలు పంపిణీ

పెట్లూరు పరిశోధన స్థానం నుంచి ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాలతోపాటు అనంతపురం, ప్రకాశం, కడప, తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలకు నిమ్మ మొక్కలు సరఫరా చేస్తున్నారు. ఏటా సుమారు లక్ష మొక్కల వరకు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

నేదురుమల్లి హయంలో..

మెట్ట ప్రాంత రైతులకు భరోసా కల్పించేందుకు 1991లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వెంకటగిరి మండలం పెట్లూరు గ్రామ సమీపంలోని 200 ఎకరాల్లో నిమ్మ, చీనీ పరిశోధన స్థానం స్థాపించారు. అప్పటి నుంచి ఇక్కడ నిమ్మ, చీనీ పంటలపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించి మేలు రకం మొక్కలను రైతులకు పరిచయం చేస్తున్నారు.



పరిశోధన స్థానంలో పెట్లూరు పులుసు నిమ్మ చెట్లు



నిమ్మ నారులో సస్యరక్షణ చర్యలు చేపడుతున్న మహిళలు

అవగాహన కల్పిస్తున్నాం



నిమ్మ రైతులకు పంటల సాగుపై సమావేశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. అలాగే పంటకు సోకే తెగుళ్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివారణకు సలహాలు, సూచనలు అందజేస్తున్నాం. రైతులు నిమ్మ పంటపై దృష్టిసారిస్తే అధిక లాభాలు గడించవచ్చు.

– డాక్టర్ ఈకే నాయక్, శాస్త్రవేత్త

మూడు లక్షలు పంపిణీ



ప్రస్తుతం నిమ్మ, చీనీ పరిశోధన స్థానం నుంచి ఏటా సుమారు లక్షపైగా నిమ్మ మొక్కలను సరఫరా చేస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్లూరు నిమ్మ పంటపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఏడాదికి మూడు లక్షలకు పైగా మొక్కలు పంపిణీ చేయాలని లక్ష్యాలను నిర్దేశించుకున్నాం.

– శ్యామ్‌సుందర్, ప్రధాన శాస్త్రవేత్త

కష్టానికి ఫలితం



పెట్లూరు పులుసు నిమ్మ మొక్కలతో రెండున్నర ఎకరాల్లో సాగు చేపట్టా. వీటికి ఎలాంటి తెగుళ్లు పెద్దగా రాకపోవడంతో పెట్టుబడి వ్యయం బాగా తగ్గింది. పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సైతం మాకు పూర్తిగా సహకరించారు. పులుసు నిమ్మకు డిమాండ్ ఉండడంతో మార్కెటింగ్ సులభతరంగా మారింది. కష్టానికి తగ్గ ఫలితాలు పొందుతున్నా.

– గుంజి గురుస్వామి, హస్తకావేరి, బాలాయపల్లె మండలం

లాభదాయకం



గతంలో నిమ్మసాగు చేపడితే పెద్దగా ఆదాయం వచ్చేది కాదు. ఆశించిన దిగుబడి కూడా ఉండేది కాదు. పంట నాణ్యంగా లేక గిట్టుబాటు ధర దక్కేది కాదు. అయితే పెట్లూరు పరిశోధన కేంద్రం అందించిన పులుసు నిమ్మ రైతులకు లాభదాయకంగా మారింది. ఈ నిమ్మ చెట్ల జీవితకాలంలో ఎక్కువగా ఉండడంతో భవిష్యత్‌పై ధైర్యం వచ్చింది.

– కాటూరు రవీంద్రనాథ్‌రెడ్డి, మన్నూరు, బాలాయపల్లె మండలం

గరుడ గమనా రారా..!

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. తిరుపతికి చెందిన శ్రీరాధిక కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్యాలను ఆకట్టుకున్నాయి. అందులో భాగంగా అదివో అల్లదివో, ఘల్లు ఘల్లు, వస్తావజానకి, జాజిరి జాజిరి, కోయిలారే, శ్రీలలితా హారతి, గరుడ గమనా రారా, ఓపిల్లడా ఎంకటేశా తదితర పాటలకు కళాకారులు పావని, గీతిక, కోమలశ్రీ, చరిష్మ, గౌరవి, జస్మిత, హేమశ్రీ, షణ్ముఖ ప్రియ, భవ్య, రిత్విక, భవిష్య అభినయించిన హావభావాలు మంత్రముగ్ధం చేశాయి. కళాకారులను ఏఓ ఖాదర్‌వలీ సత్కరించారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్‌'

తిరుపతి అర్బన్‌ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌ డే నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరించనున్నారు. కార్యక్రమానికి కలెక్టర్‌ వెంకటేశ్వర్‌తోపాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు కలెక్టరేట్‌ సిబ్బంది వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌



పోలీసుల అదుపులో నిందితులు

పాకాల : మండలంలోని మొగరాల పంచాయతీ శేషాపురం సమీపంలోని మామిడి తోటలో ఆదివారం నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుదర్శన్‌ ప్రసాద్‌ తెలిపారు. నిందితులు కేవీ దేవీప్రసాద్‌, బి.వెంకటేష్‌, పి.లక్ష్మణ్‌రెడ్డి, కె.భరత్‌, ఎన్‌.దేవేంద్ర, కె.మహేంద్రనాయుడు(పాల చిన్న) నుంచి రూ.3,600 నగదు, ఆరు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అరెస్ట్‌ చేసిన వారిని కోర్టులో హాజరు పరచనున్నట్లు వివరించారు. ఈ క్రమంలో మొబైల్‌ గ్యాంబ్లింగ్‌పై సైతం పోలీసులు దృష్టి సారించాలని పాకాల వాసులు కోరుతున్నారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్‌ జూదం నిర్వహిస్తూ వందలాది కుటుంబాలను వీధిన పడేస్తున్నవారిపై చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. మొబైల్‌ గ్యాంబ్లింగ్‌లో స్థానిక టీడీపీ నేత కీలకపాత్ర పోషిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

తిరుపతి అర్బన్‌/ క్రైమ్‌ : తిరుపతిలోని పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో ఆదివారం రిపబ్లిక్‌ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ వెంకటేశ్వర్‌ చేతులమీదుగా 479 మంది ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు వారు పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవంలో అవార్డులు పొందడం గర్వంగా ఉందన్నారు. మరింత ఉత్సాహంతో ప్రజాసేవకు పునరంకితం అవుతామని వెల్లడించారు.



కలెక్టర్‌ నుంచి అవార్డు అందుకుంటున్న తిరుపతి కార్పొరేషన్‌ కమిషనర్‌ మౌర్య, అవార్డు అందుకుంటున్న డీఆర్‌ఓ నరసింహులు, సూక్ష్మ సేద్యం జిల్లా అధికారి సతీష్‌, డీపీఓ ప్రసాద్‌రావు, ఆర్‌డీఓ రామ్మోహన్‌ స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌ దేవేంద్రరెడ్డి, ఇరిగేషన్‌ అధికారి లక్ష్మీదుర్గ, డీపీఓ రామ్మోహన్‌



కలెక్టరేట్‌ డీటీ రేఖ, ఆర్‌అండ్‌బీ అధికారి రెడ్డయ్య, డీఈఓ కేఎస్‌ఎన్‌ కుమార్‌, జిల్లా రిజిస్ట్రార్‌ శ్రీరామకుమార్‌, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డీటీ రామచంద్ర,ఎస్సీ వెల్ఫేర్‌ జిల్లా అధికారి చెన్నయ్య, ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధికారి నాగరాజు, ఇరిగేషన్‌ ఎస్‌ఈ మల్లికార్జునరెడ్డి



లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ విశ్వనాథ్‌రెడ్డి, మైనింగ్‌ ఏడీ బాలాజీనాయక్‌, స్కిల్‌ డెవలప్‌మెంట్‌ జిల్లా అధికారి లోకనాథం, జిల్లా క్రీడాధికారి సయ్యద్‌ బాషా, టూరిజం రీజనల్‌ డైరెక్టర్‌ రమణప్రసాద్‌, టూరిజం జిల్లా అధికారి జనార్దన్‌రెడ్డి , డీపీఆర్‌ఓ బాలకొండయ్య, సమాచార పౌరసంబంధాలశాఖ ఫొటోగ్రాఫర్‌ రవి, వీడియో గ్రాఫర్‌ గురుప్రసాద్‌, కలెక్టరేట్‌ సిబ్బంది రాజేష్‌, సాయికృష్ణ, తుడా ఈఈ రవీంద్ర, జిల్లా సర్వే విభాగం డీడీ అరుణ్‌కుమార్‌



కలెక్టరేట్‌ ఏఓ భారతి, కలెక్టరేట్‌ తహసీల్దార్‌ కుప్పయ్య, కలెక్టరేట్‌ డీటీ శిరీషా, తిరుపతి ఆర్‌డీఓ ఆఫీస్‌ ఏఓ రూన్సీలక్ష్మి, కలెక్టరేట్‌ ఉద్యోగి జ్యోతి, తిరుపతి గంగమ్మ ఆలయ ఈఓ జయకుమార్‌, గంగమ్మ ఆలయ ఉద్యోగి అయ్యప్ప, ఉద్యానశాఖ అధికారి రాధారాణి, సీఐ రామకృష్ణ, అవార్డు అందుకుంటున్న ఏఎస్పీ రవి మనోహరాచారి, ఏఎస్పీ వెంకట్రావ్‌



సీఐ ఇమ్రాన్‌ బాషా, సీఐ వినోద్‌కుమార్‌, సీఐ రమణారెడ్డి, సీఐ జయచంద్ర, సీఐ గోపి, సీఐ సురేంద్రనాయుడు, సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ సాయినాథ్‌ చౌదరి, ఎస్‌ఐ రాజశేఖర్‌



ఎస్‌ఐ విజయలక్ష్మి, ఎస్‌బీ ఎస్‌ఐ సోమలనాయక్‌, పోలీస్‌ సిబ్బంది కార్తీక్‌, సుమాల్‌కుమార్‌, ఈశ్వరయ్య, పురుషోత్తమ నాయుడు, మస్తాన్‌ అలీ, అవార్డు అందుకుంటున్న సీఐ వినోద్‌కుమార్‌, గురుకుల సంక్షేమాధికారి అనీలా కుమారి

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 77,651 మంది స్వామివారిని దర్శించుకోగా 26,677 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.07 కోట్లు సమర్పించారు. టైంస్లాట్‌ టోకెన్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

విచ్చలవిడిగా 'చుక్క..ముక్క'!

- యథేచ్ఛగా మాంసం విక్రయాలు
- బ్యాక్‌డోర్‌లో మద్యం అమ్మకాలు
- పట్టించుకోని అధికారులు
- తూతూ మంత్రంగా తనిఖీలు

శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తి రూరల్‌ (రేణిగుంట)/నాగలాపురం : గణతంత్ర దినోత్సవం సందర్భంగా మద్యం, మాంసం విక్రయాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినప్పటికీ ఆదివారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మాత్రం యథేచ్ఛగా మద్యం ఏరులై ప్రవహించింది. విచ్చలవిడిగా మాంసం, చేపల విక్రయాలు సాగాయి. దాబాలు, హోటళ్లలోట మాంసాహారం సైతం అమ్మకాలు కొనసాగాయి. ప్రధానంగా అధికార పార్టీ పట్టణ కార్యాలయ సమీపంలో గుట్టుగా మద్యం విక్రయాలు సాగించారు. అలాగే మార్కెట్‌ వీధి, కొత్త బస్టాండు, మిట్టకండిగ, రాజీవ్‌నగర్‌లోని బెల్ట్‌ దుకాణాలు, అగ్రహారం టరిన్నింగ్‌, హాస్పిటల్‌ రోడ్డులోని బార్‌లలో బ్యాక్‌డోర్‌ అమ్మకాలు సాగించారు. ఇదే అదునుగా కొందరు వైన్‌షాపు యజమానులు అధిక ధరలకు మద్యం విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఎక్సైజ్‌ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ గిరి ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణ సమీపంలోని పలు దాబాల్లో తనిఖీలు చేపట్టారు. బైపాస్‌రోడ్డులోని ఓ ప్రైవేట్‌ కల్యాణమండపం దగ్గ దాబాలో మాంసాహారం సిద్ధం చేస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అయితే స్థానిక కూటమి నేతలు జోక్యం చేసుకోవడంతో ఎలాంటి కేసులు నమోదు చేయకుండా వదిలేసినట్లు తెలిసింది.



రేణిగుంట : రోడ్డు పక్కన చేపల విక్రయం, నాగలాపురం: కోడిని తీసుకెళుతున్న చికెన్‌ షాపు నిర్వాహకుడు

రేణిగుంటలో..

రిపబ్లిడే రోజున రేణిగుంటలో విచ్చలవిడిగా మాంసం విక్రయాలు కొనసాగాయి. పోలీసుల హెచ్చరికలను సైతం దుకాణదారులు బేఖాతరు చేశారు. బాలికల జిల్లా పరిషత్‌ పాఠశాల ఎదురుగా చేపల అమ్మకాలు చేపట్టారు. కొందరు షాపులు మూసేసి, వెనుక వైపు నుంచి చికెన్‌, మటన్‌ విక్రయించారు. వైన్‌షాపుల్లో సైతం అధిక ధరలతో మద్యం అమ్మకాలు చేపట్టడం గమనార్హం.

నాగలాపురంలో..

నాగలాపురంలోని బజారు వీధిలో విచ్చలవిడిగా మద్యం, మాంసం విక్రయాలు సాగాయి. అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.

•అమ్మ మనసు

తిరుపతి పోలీస్‌ పరేడ్‌ మైదానంలో ఆదివారం రిపబ్లిక్‌ డే వేడుకల్లో అధికారులు నిమగ్నమయ్యారు. వేదికపై జాయింట్‌ కలెక్టర్‌ శుభం బన్సల్‌ బిజీగా ఉన్నారు. ఆయన సతీమణి తమ ఆరునెలల బాబుతో ఆశీనులయ్యారు. కార్యక్రమ హడావుడికి చిన్నారి ఏడుపు మొదలెట్టడంతో జేసీ ఓదార్చేందుకు యత్నించారు. ఆ దంపతుల అవస్థను గమనించిన తిరుపతి కార్పొరేషన్‌ కమిషనర్‌ మౌర్య వెంటనే బిడ్డను దగ్గరకు తీసుకున్నారు. బాబును ప్రేమగా లాలించి అమ్మ మనసు చాటుకున్నారు.

– తిరుపతి అర్బన్‌



మళ్లీ ఉల్లంగనులు!

మొదలైన మైనింగ్‌ దందా?

- క్వార్ట్జ్‌ లారీని పట్టుకున్న పోలీసులు
- అనుమతులు పొందిన 40 గనుల్లో కుస్తీ రాయుళ్లు
- షిఫ్టుల వారీగా అధినేత కనుసన్నల్లో నిఘా
- అసలైన మైనింగ్‌ యజమానులకు దక్కని అనుమతులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్‌: సైదాపురం మండలంలో మైనింగ్‌ దందా మళ్లీ మొదలైంది. శనివారం తెల్లవారు జామున రాపూరు సీఐ ఆధ్వర్యంలో సైదాపురంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా క్వార్ట్జ్‌ తరలిస్తున్న లారీని పట్టుకుని ఆదివారం మైనింగ్‌ అధికారులకు అప్పగించారు. దీంతో ఖనిజ సంపదను అక్రమ తరలింపు గుట్టు రట్టయ్యింది. మండలంలోని పెరుమాళ్లపాడు అంకమ్మబోడు కొండపైన, చుట్టుపక్కల అపారమైన ఖనిజ సంపదను అక్రమార్కులు కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్న విషయం తేటతెల్లమైంది.ఈ మేరకు చీకటిపడితే పెరుమాళ్లపాడు సమీపం నుంచి రోజూ 2 నుంచి 5 లారీలు తరలిస్తున్నట్లు సమాచారం.



మైకా క్వార్ట్జ్‌ గని ఇదే



పెరుమాళ్లపాడు అంకమ్మబోడు తిప్ప ఇదే

40 గనులకు మాత్రమే అనుమతి

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వెంకటగిరి, సర్వేపల్లి, గూడూరు నియోజకవర్గాల్లో 7 భూగర్భ గనులు, 140 ఓపెన్‌ క్వార్ట్జ్‌ గనులున్నాయి. ఇటీవల అన్ని గనులను ఉన్నతాధికారుల బృందం ప్రత్యేకంగా పర్యవేక్షించింది. ఈ క్రమంలో 80 గనులకు అనుమతులు మంజూరు చేయవచ్చని సూచించింది. ఈ విషయంపై డీఎంజీకి నివేదిక కూడా పంపింది. వాటిలో 40 గనులకు మాత్రమే అధికారులు అనుమతులను మంజూరు చేశారు. డెడ్‌ రెంట్‌, లీజులు పొందిన యజమానులకు అనుమతులు ఇవ్వడంలో జాప్యం చేస్తుండడంతో వారంతా ఏకమై అధికారులతో ఢీ అంటే ఢీ అంటున్నారు.

గని యజమానులకు మొండి చెయ్యే!

అసలైన గని యజమానులకు మొండిచెయ్యే మిగిలింది. ఆ ముఖ్యనేత అనుమతులు మంజూరు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంకటగిరి రాజాలకు సైదాపురం మండలంలో మైనింగ్‌ పరిశ్రమ ఉంది. ఈ పరిశ్రమపై ఆధారపడి వందలాది మంది జీవనం సాగిస్తున్నారు. అలాగే రాధకృష్ణ మైనింగ్‌ కంపెనీలో కూడా వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఆ రెండు గనులకు మాత్రం అనుమతులు మంజూరు చేయలేదు. సదరు ముఖ్యనేత అనుమతితో మంజూరైన 40 గనుల్లో ఇప్పటికే ఆ గనులకు ఒక గనికి ముగ్గురు చొప్పున మూడు షిఫ్టుల్లో కుస్తీరాయుళ్లను నియమించారు. దీంతో అనుమతి పొందిన యజమానులు కూడా నివ్వెరపోతున్నారు.

కుస్తీరాయుళ్లతో గస్తీ

అధినేత అనుమతితో మంజూరైన 40 గనుల్లో ఒక్కో గనికి ముగ్గురు చొప్పున కుస్తీరాయుళ్లను నియమించి నిఘా ఉంచారు. ఆ గనుల నుంచి కేవలం మైకా, ఫల్స్‌పర్‌ ఖనిజం మాత్రమే సంబంధిత యజమానులు తరలించాలి. మైకా క్వార్ట్జ్‌, క్వార్ట్జ్‌ ఖనిజం మాత్రం ఆ అధినేతకే ఇవ్వాల్సి ఉంటుంది. ఆ ఖనిజాన్ని తరలించకుండా కట్టుదిట్టంగా అక్కడే కుస్తీరాయుళ్లను తిష్ట వేయించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ